క్లుప్తంగా

మేలు చేసిన వైఎస్సార్‌సీపీని ఆదరించండి


మాట్లాడుతున్న కుంకనూరు వీరేష్

ఆదోని అర్బన్: దళితులకు, క్రిస్టియన్లకు మేలు చేసిన వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇవ్వాలని అంబేడ్కర్ కో–ఆపరేటివ్ సంఘం డైరెక్టర్ కుంకనూరు వీరేష్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం స్థానిక భీమాస్ ఫంక్షన్‌హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. దళితులు, క్రిస్టియన్లు కష్టాల్లో ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగనన్న ఎస్సీ, క్రిస్టియన్లకు ఎంతగానో తోడ్పాటు అందించారని వివరించారు. పాస్టర్లకు, పూజారులకు గౌరవ వేతనం అందించారన్నారు. ఆదోని నియోజకవర్గంలో 50 నుంచి 60 వేల వరకు ఎస్సీ, క్రిస్టియన్ ఓటర్లు ఉన్నాయని, మేలు చేసిన వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం


దాతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శుక్రవారం భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. కోసిగికి చెందిన పాతు నాగరాజు కుటుంబసభ్యులు రూ.లక్ష, అలాగే కర్ణాటక రాష్ట్రం మాన్వి పట్టణ వాస్తవ్యులు సుమిత్ర నరసింహప్ప కుటుంబసభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందించినట్లు చెప్పారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు, లడ్డూలను, బాండు, స్వామివారి ఫొటోను అందజేశారు. అలాగే శుక్రవారం బసవ జయంతి పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు వీరప్పస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న జయమనోజ్ రెడ్డి

ఆదోని అర్బన్: బ్రాహ్మణ సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని యువ నాయకుడు జయమనోజ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ద్వారకా ఫంక్షన్ హాల్‌లో నఖాతేశ్యాం ప్రసాద్ అధ్యక్షతన బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో శ్యాంప్రసాద్, హరివాణం రాఘవేంద్ర ఆచార్ మాట్లాడుతూ పట్టణంలో దాదాపుగా 1250 బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నాయని, చాలామంది పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొంతిల్లు లేనివారికి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని, అపరకర్మల భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. జయమనోజ్ రెడ్డి మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాడ్డాక బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ, హన్వాల్ గోపాల్‌రావు, నఖాతే వాదిరాజు, పట్టణంలోని బ్రాహ్మణులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్


బైచిగేరిలో ప్రచారం చేస్తున్న ఆత్మ చైర్మన్ కృష్ణారెడ్డి

ఆదోని సెంట్రల్: పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆదరించాలని ఆత్మ చైర్మెన్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం మండలంలోని బైచిగేరి గ్రామంలో నాలుగవ రోజు వైఎస్సార్‌సీపీ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాడవాడలా ఇంటింటికీ తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విన్నవించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. మన పిల్లలు బాగుపడాలన్నా, భవిష్యత్తు బాగుండాలన్నా తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ మహాదేవ, ఎంపీటీసీ నాగభూషణ్ రెడ్డి కార్యకర్తలు రఘునాథ్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు చేపట్టనున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ కోతలు ఉంటాయని వెల్లడించారు.

అభివృద్ధి పరుగులు.. సంక్షేమ వరాలు


ఎమ్మిగనూరులో నిర్మించిన బీటీ రోడ్డు



మైనార్టీ కాలనీలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్

ఎమ్మిగనూరు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టగానే ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా జరిగాయి. లక్షకు పైగా జనాభా ఉన్న ఎమ్మిగనూరు పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు ఏఐఐబీ పథకం ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి ఎమ్మిగనూరుకు రూ.148 కోట్లతో చేపట్టిన పనులు వేగం పుంజుకున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో రూ.13 కోట్లతో వివిధ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. ముఖ్యంగా సోమప్ప సర్కిల్‌లో నాలుగు కూడళ్ల రోడ్లు, మిలటరీ కాలనీ రోడ్లు, ఎంజీ కాలనీ, వీవర్స్ కాలనీ, లక్ష్మీపేట, మైనార్టీ కాలనీ, ఖిబుల్లా క్వాటర్స్, శివన్ననగర్, మునెప్పనగర్, ఇంద్రానగర్, తిరుమలనగర్, సోమప్ప నగర్‌లో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలతో పట్టణ ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉద్యాన పార్కుల అభివృద్ధి, పట్టణ సుందరీకరణ పనులు చేపట్టారు. పట్టణ ప్రధాన వీధుల్లో సెంట్రల్ లైటింగ్, ఎల్ఈడీ విద్యుత్ వెలుగులతో పట్టణం ఆకర్షణీయంగా మారింది. అదేవిధంగా రూ.12 కోట్లతో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆధునీకరణ పనులు చేపట్టారు. రూ.1.6 లక్షలతో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లకు నూతన భవన నిర్మాణాలు జరిగాయి. రూ.52 కోట్లతో దశాబ్దకాలంగా కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. నిర్మాణంలో ఉన్న జీ+3 ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తిచేసి 3500 మంది లబ్ధిదారులకు గృహాలను కేటాయించారు. జగనన్న కాలనీలో పట్టణ పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణ, పార్కులలో, డంప్‌యార్డు దగ్గర చేపట్టిన అభివృద్ధి పనులతో పట్టణం మరింత ఆకర్షణీయంగా మారింది. అటు అభివృద్ధితోపాటు పట్టణంలోని పేదలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయల లబ్ధి చేకూరింది.


ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం

ఎమ్మిగనూరులో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి వివరాలు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
జగనన్న అమ్మఒడి	10.987	57.74
జగనన్న విద్యాదీవెన	7053	25.69
జగనన్న వసతి దీవెన	5610	9.99
వైఎస్ఆర్ రైతుభరోసా	4419	20.18
ఉచిత పంటలబీమా	3158	6.54
సున్నావడ్డీ రుణాలు	1205	0.38
వైఎస్సార్ పెన్షన్‌కానుక	11.871	191.69
వైఎస్సార్ చేయూత	6.085	36.59
వైఎస్సార్ ఆసరా	13.547	32.68
సున్నా వడ్డీ	18.327	6.54
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	3.746	13.97
నేతన్న నేస్తం	1884	15.49
కోవిడ్ సాయం	20.749	20.72
జగనన్న తోడు	1249	0.78


సోమప్ప సర్కిల్‌లో సుందరీకరణ

నేటితో ప్రచారానికి తెర


రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆదోని ఆర్వో శివనారాయణశర్మ

ఆదోని రూరల్: పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందే రాజకీయ పార్టీల ప్రచారం ఆపేయాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం సబ్‌కలెక్టర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల నుంచి ఆదోని నియోజకవర్గంలో ప్రచారం కోసం వచ్చిన నాయకులు శనివారం సాయంత్రం 5 గంటల్లోపు వెళ్లిపోవాలన్నారు. ఎన్నికల రోజు ఉదయం 5 గంటల్లోపే ఏజెంట్లు పోలింగ్ కేంద్రానికి హాజరు కావాలన్నారు. ఏజెంట్ సమక్షంలోనే మాక్ పోల్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభిస్తామన్నారు. ఓటింగ్ శాతం పెంచడానికి మీ వంతు సహకారం అందజేయాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల వరకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిబంధనలు తప్పక పాటించి శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకారం అందించాలని కోరారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, వీరభద్రప్ప, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరు


కోసిగి రోడ్డుషోలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కోసిగి: ఊరూ వాడ వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతోంది. తమ విజయాన్ని ఏ కూటమి అడ్డుకోలేదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఉద్ఘాటించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోసిగి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి రోడ్డుషో చేపట్టారు. ఇసుకేస్తే రాలనంతగా అశేష జనవాహిని పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన విజయం తథ్యమని చెప్పడానికి ఈ రోడ్డు షో నిదర్శనమని స్పష్టం చేశారు. టీడీపీ నేతలు తలకిందులుగా తపస్సు చేసినా విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి ప్రజలకు మేలు చేయడం తప్ప దౌర్జన్యాలు చేయడం తెలియదన్నారు. 15 ఏళ్ల చరిత్రలో ఏనాడూ గొడవలకు పురిగొల్పలేదని వెల్లడించారు. టీడీపీ నేతలు దౌర్జన్యాలు చేయడం.. నెపాన్ని తమపై నెట్టడం హాస్యాస్పదమన్నారు. బీసీలు, వాల్మీకులకు తమ పార్టీలోనే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. కోసిగి మండలంలో ఎంపీపీ, సింగిల్ విండో ప్రెసిడెంట్ మొదలు సర్పంచులు, ఎంపీటీసీలుగా వాల్మీకులు ఉన్నారని తెలిపారు. కోసిగిలో తాగునీటి సమస్య పరిష్కారానికి తన తనయుడు ధరణీధర్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగియగానే ఎస్ఎస్ ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. అలాగే పులికనుమ ప్రాజెక్టు నుంచి కోసిగి రైతుల కోసం ప్రత్యేక లిఫ్టు ఇరిగేషన్ సైతం రూపొందించడం తెలిసిందేనన్నారు. మేలు చేసిన వారినే ఆదరించాలని కోరారు.


రోడ్డుషోలో పాల్గొన్న మహిళలు

ప్రభ'జనం' మధ్య ప్రచారం :

కోసిగిలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రచారం జన ప్రభంజనం మధ్య అద్వితీయంగా కొనసాగింది. వేలాదిగా తరలివచ్చిన జనం మధ్య రోడ్డుషో సాగింది. ఆడపడచుల సంప్రదాయ దరువులు, బాణసంచాల మిరుమిట్లు, అడుగడుగునా సత్కారాలతో నేత్ర పర్వంలా రోడ్ షో జరిగింది. మండల కేంద్రంలో మౌంటు కార్మెల్ నుంచి మార్కండేయ స్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండ్, వైఎస్సార్ సర్కిల్, సబ్ రిజిస్ట్రార్, దొరలచావిడి, కొండుగేని వీధి, నాగన్న కట్ట, మారెమ్మ ఆలయం, కడపాలెం వరకు యాత్ర చేపట్టారు. టీడీపీ నేత చంద్రబాబు, బాలకృష్ణ రోడ్డు షోకు కూడా ఇంతలా అభిమానులు తరలిరాలేదని చర్చ సాగడం విశేషం. రోడ్డు షోలో పార్టీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, బెట్టనగౌడ్, ఈరన్న, అయ్యమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

ఆదోనిటౌన్: ప్రజా సంక్షేమం వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, పెత్తందారుల పక్షాన నిలిచే పార్టీ టీడీపీ అని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలోని అమరావతినగర్, రాయ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన కూడళ్లల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రజా సమస్యలు, ఆదోని ప్రజల ఆకాంక్షలపై అవగాహన లేని బీజేపీ అభ్యర్థి పార్థసారథి అనాలోచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేను విమర్శిస్తే ఓట్లు పడతాయనే దురాశలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 30 ఏళ్లుగా ఆదోని ప్రజలకు సేవచేస్తూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నానన్నారు. ఆదోనిలో జరిగిన అభివృద్ధిని చూపిస్తాను, బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బీజేపీ అభ్యర్థి పార్థసారథిని ఇంటికి సాగనంపేందుకు ఆదోని ఓటర్లు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రిస్వామి, అనుచరులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. మహిళలు, యువతులు హారతులు పట్టారు. మీ ఆశీస్సులు నాకు శ్రీరామరక్ష అని, 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన మౌలా, తన్వీర్, ఇమ్రాన్, మహబూబ్, బి.ఇమ్రాన్, లాలీ, అనూష, ఖాజా, మక్బుల్‌తో పాటు మరో 50 మంది యువకులు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తనదృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పెద్దతుంబళం యువకులు

కూటమి కుట్రలను తిప్పికొట్టండి

ఆదోని రూరల్: అధికారం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. నాయకులు పంపాపతి, ఉచ్చప్ప, బసవరాజు, నరసయ్య, హనుమంతరెడ్డి, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.


జెండాలు పట్టుకుని ప్రచారంలో పాల్గొన్న మహిళలు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి


గాయపడిన తిమ్మారెడ్డి

కోసిగి: రౌడీషీట్‌లో పేరు నమోదై ఉన్న టీడీపీ కార్యకర్త దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన తిమ్మారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రోడ్ షో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తిమ్మారెడ్డి, నాగేంద్ర బైక్‌పై వెళుతుండగా టీడీపీ నేత మల్లారెడ్డి వెంకటేష్ దుర్భాషలాడి రెచ్చగొట్టాడు. దీంతో ఘర్షణ ఏర్పడింది. వెంకటేష్ కర్రతో తిమ్మారెడ్డి తలపై కొట్టడంతో తీవ్ర రక్త గాయమైంది. బాధితుడిని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కోసిగి ఎస్ఐ సతీష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

ముస్లిం రిజర్వేషన్లపై కూటమి కుట్రలు

ఎమ్మిగనూరుటౌన్: ముస్లింల రిజర్వేషన్లపై బీజేపీతో జతకట్టిన టీడీపీ కూటమి కుట్రలు పన్నుతోందని, ముస్లింలందరూ ఏకమై కూటమికి ఓటుతో బుద్ధి చెప్పాలని జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, జామియా మసీదు అధ్యక్షుడు, కౌన్సిలర్ ఖాశింబేగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బిలాల్ మసీదులో నమాజు అనంతరం వారు ముస్లింలను కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుకను గెలిపించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ల కొనసాగింపు సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే రాబోవు రోజుల్లో ముస్లింల అభ్యున్నతికి మరింత కృషి చేస్తారన్నారు. ముస్లిం మైనారిటీ నాయకులు వాహిద్, ఇషాక్, షాబుద్దీన్, హాజీ వహబ్, రసూల్, సయ్యద్ చాంద్, ఖిబులా హుసేన్, కొండాపురి రహంతుల్లా, రజాక్, అబ్రార్, గౌస్, ఫయాజ్, ఉబేద్ తదితరులు పాల్గొన్నారు.


ఓటు అభ్యర్థిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమం

మంత్రాలయం/కోసిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కనీవినీ ఎరుగని రీతిలో పేదలకు సంక్షేమ పథకాలు అందించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం కోసిగి మండలంలోని డి.బెళగల్, దొడ్డి, పల్లెపాడు, చింతకుంట గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన రోడ్డు షోలో ఆయన ప్రసంగిస్తూ.. పేదల సంక్షేమం కోసం పని చేసిన ఏకైక ప్రభుత్వం జగనన్నదే అని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు ఏనాడు పేదల గురించి ఆలోచన చేయలేదన్నారు. దీర్ఘదృష్టితో పేదల కోసం నవరత్నాలను అమలు చేయడం జరిగిందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని పాలన సాగించారని కొనియాడారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘువేంద్ర రెడ్డి గతాన్ని మరచిపోయారని, చేరదీసిన తమపైనే ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని విన్నవించారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ బెట్టనగౌడ్, ఎంపీపీ ఈరన్న, నాయకులు శ్రీనివాసరెడ్డి, మహంతేష్‌స్వామి, బసిరెడ్డి, రవిగౌడ్, లంకారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చింతకుంటలో రోడ్డు షోలో ప్రసంగిస్తున్న వై.ప్రదీప్‌కుమార్ రెడ్డి

జగనన్న పాలనలో మహిళలకు ఆత్మగౌరవం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక


హాజరైన మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళల అభ్యున్నతికి పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక స్పష్టం చేశారు. ఆమె శుక్రవారం పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీ, మిలటరీ కాలనీ, శారద కమిటీ స్కూల్ ప్రాంతం, ఖానిపంజా మైదానాల్లో ఏర్పాటు చేసిన 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 22, 23, 24, 25, 26, 27, 29 వార్డుల్లో నిర్వహించిన సభలకు వేలాది మంది మహిళలు తరలివచ్చారు. తమకు సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగనన్నకు వారు మద్దతు పలికారు. ఆయా సభల్లో బుట్టా రేణుక మాట్లాడుతూ.. సీఎం జగనన్న మహిళలకే ప్రాధాన్యతనిచ్చి ప్రతి సంక్షేమ పథకాన్ని వారికే అందించారని గుర్తుచేశారు. ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి సహకారంతోపాటు చేయూత, ఆసరా, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారుల అకౌంట్లకే ఆర్థిక సాయం జమ చేశారన్నారు. గత టీడీపీ హయాంలో పసుపు కుంకుమ పేరుతో డ్వాక్రా మహిళలకు చంద్రబాబు నాయుడు మోసం చేశారని, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయని దుర్మార్గపు పాలన టీడీపీదే అన్నారు. టీడీపీ వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఆపార్టీ అధికారంలోకి వస్తే జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ రద్దవుతాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతి కుటుంబం వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కర్నూలు ఎంపీగా ఐదేళ్లు పనిచేసిన తాను అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేశానని ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిస్తే పట్టణంలోనే అందరికి అందుబాటులో ఉండి ప్రజా సేవకురాలిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని విన్నవించారు. పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, రాష్ట్ర వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, నాయకులు రియాజ్ అహమ్మద్, డిష్ కేశవరెడ్డి, తరున్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రామాంజినమ్మ, నీలకంఠ, ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం


పారసపల్లిలో ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి


హాలహర్విలో ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నమూనా బ్యాలెట్‌తో ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి


సోమలగూడూరులో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్


ఎమ్మిగనూరులో ప్రచారం చేస్తున్న బుట్టా సాహితి


కౌతాళంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


ఎమ్మిగనూరులో పోలీసులతో మాట్లాడుతున్న కర్నూల్ రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

ఎమ్మిగనూరురూరల్/ఆదోని అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని కర్నూల్ రేంజ్ డీఐజీ సీహెచ్. విజయరావు, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు. వారు శుక్రవారం సాయంత్రం స్థానిక డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల బందోబస్త్‌పై చర్చించారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అల్లర్లు జరుగుతున్నట్లు సమాచారం వస్తే వెంటనే స్పందించాలని ఆదేశించారు. అలాగే ఆదోని పట్టణంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. డీఎస్పీలు సీతారామయ్య శివనారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.